# సత్యవాక్కు

# THE WORD OF TRUTH

క్రైస్తవ తెలుగు మాసపత్రిక

OCTOBER - 1999

## సంక్షిప్త వార్తలు

1999 సెప్టెంబరు 13వ తేదీ సోమవారం నాడు సహో. జె.సి. బెయిలీ గారు తన 96వ జన్మదినోత్సవమును కెనడా దేశములో, వేబర్న్ పట్టణంలో జరుపుకొనిరి. ఆయన ఇప్పుడొక వయోవృద్ధుల ఆశ్రమంలో యున్నారు. ఆ దినమున ఆయన కుమారులు, కుమార్తెలు, మనుమలు, మనుమరాండ్రు, ముది మనుమలు మొత్తం వంద మందికి పైగా వేబర్న్ పట్టణమునకు వెళ్లి ఆయనను అభినందించిరి. ఆ సందర్భముగా ఒక స్తుతి కూటమును కూడా ఏర్పాటు చేసిరి. దానిలో అమెరికా నుండి ప్రత్యేకంగా వెళ్లిన సోదరులు ఐరా రైస్ గారు వాక్య పరిచర్య చేసిరి. భారతదేశము నుండి సోదరులు జాషువా గూటం గారు బెయిలీ గారికి టెలిఫోన్ ద్వారా జన్మదిన శుభాకాంక్షలు అందజేసిరి. బెయిలీ గారి ఆరోగ్యము నిమిత్తం అందరు ప్రార్థించమనవి.

సెప్టెంబరు 14వ తేదీ మంగళవారం పశ్చిమ గోదావరి జిల్లా ఆచంట గ్రామములో సోదరులు పి.సామ్యేలురాజు గారి కుమారుని జన్మదిన సందర్భముగా మంచి సువార్త కూటము ఏర్పాటు చేయబడెను. సోదరులు జాషువా గారు సతీ సమేతముగా ఆ కూటమునకు హజరై చక్కటి వాక్యోపదేశము చేసిరి. ఆచంట ప్రాంతమున నున్న క్రీస్తు సంఘ సువార్తికులందరు ఆ కూటములో పాల్గొని ప్రభువును స్తుతించిరి.

సెప్టెంబరు 27వ తేదీ సోమవారం నాడు సోదరులు జాషువా గారు, సోదరి కవితా, మరియు వారి రెండవ కుమారుడు సామ్యేలు రోనీ కలకత్తా మీదుగా మణిపూర్‌కు బయలుదేరి వెళ్లిరి. 28వ తేదీ మంగళవారం వారు కలకత్తా స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ సభ్యులను, సంఘమును దర్శించిరి. 29వ తేదీ బుధవారం కలకత్తా నుండి మణిపూర్ ముఖ్య పట్టణమైన ఇంపాల్‌కు విమానములో చేరుకొనిరి. 29వ తేదీ రాత్రి ఇంఫాల్ పట్టణములో లాంఫెల్ పట్ ప్రాంతములో యున్న సంఘములో సోదరులు జాషువా గారు వాక్య పరిచర్య చేసిరి.

సెప్టెంబరు 30వ తేదీ గురువారం నాడు చుర్‌చంద్రపూర్ పట్టణంలో [illegible] ప్రాంతములో యున్న సంఘము ఏర్పాటు చేసిన సువార్త కూటములో సోదరులు జాషువా గారు మూడు పర్యాయములు వాక్య పరిచర్య చేసిరి.

# సత్యవాక్కు

## THE WORD OF TRUTH

**P.O. Box 80, Kakinada, A.P. 533 001**

**Phone : 0884 - 63722**

**Editor :**

**JOSHUA GOOTAM**

**Pleading for Restoration of First Century Christianity**

సంపుటి 20 అక్టోబరు 1999 సంచిక 3


## ఒకే ప్రశ్నకు మూడు జవాబులు

(Three Answers to One Question)

"రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అనునది మన ప్రశ్న. మృత తుల్యుడు అడుగగల్గిన అతి ప్రాముఖ్య ప్రశ్న అది. అపొస్తలుల కార్యములు అను పుస్తకములో పురిశుద్ధాత్ముడు ఇచ్చిన జవాబు మనకు ఉన్నది. పరిశుద్ధాత్ముడు సర్వ సత్యములోనికి నడిపించుటకు వచ్చెను. ఈ జవాబులలో సత్యమునంతయు మనము కనుగొనవలసియున్నది. సిలువయొద్ద ఆరంభమైన కృపాయుగములో ఇంకను మనము ఉన్నాము. ఆది పునరుత్థానము తరువాత పెంతెకొస్తునాడు ప్రకటింపబడినందున, మన ఆత్మలు "రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అని యడుగు ప్రశ్నకు ఆ జవాబులో మన జవాబు ఉన్నది.

అపొ.కా. 2:37లో ఈ ప్రశ్న మొట్టమొదట అడుగబడెను. మొదటి సువార్త ప్రసంగమును వేలకొలది ప్రజలు వినిరి. వారు హృదయములలో నొచ్చుకొని, "సహోదరులారా మేమేమి చేతుము?" అని అడిగిరి. పరిశుద్ధాత్మచే నడిపింపబడిన వాడై పేతురు, "మీరు మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడు యేసుక్రీస్తు నామమున బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరమును పొందుదురు" అని వారికి జవాబిచ్చెను (అపొ.కా. 2:38).

క్రైస్తవులను పడగొట్టుటకు తార్సువాడైన సౌలు దమస్కునకు వెళ్ళుచుండగా ఈ ప్రశ్న రెండవసారి అడుగబడెను. తన కోపోద్రేక క్రియలో అతడు అకస్మాత్తుగా ఆపు చేయబడెను. యేసు తన మహిమా ప్రభావములలో అతని కగుపబడెను. ఆయన మహిమ మధ్యాహ్నవేళ సూర్యతేజస్సు కంటే తేజోమయమైయుండెను. ఆ నిత్య మహిమ శక్తివలన సౌలు అంధుడై నేలమీద పడెను. తన దుర్మార్గత గ్రహించినవాడై ఆత్మీయ నిరాశలో "ప్రభువా, నేనేమి చేయవలెను ?" అని యడిగెను. అతడు దమస్కునకు వెళ్ళవలెననియు, అతనికి అచ్చట తెలియజేయ బడుననియు ప్రభువు అతనికి చెప్పెను. అతడు దమస్కునకు పోయి, మూడు రేయింబగళ్ళు భోజనము చేయకుండ కన్నీళ్లు విడుచుచు ప్రార్థించుచుండెను. అప్పుడు అననీయ అను ఒక సువార్తికుడు వచ్చి సౌలు దృష్టిపొందునట్లు అతనిపై చేతులుంచెను. అప్పుడు సౌలుకు అతడీ మాటలను పలికెను. "గనుక నీవు తడవు చేయుట ఎందుకు ? లేచి, ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడిగివేసికొనుము" (అపొ.కా. 22:16). భూకంపము జరిగిన తరువాత ఫిలిప్పయి చెరసాలలో మూడవసారి ఈ ప్రశ్న అడుగబడెను. చెరసాల అధిపతి దీపము తెమ్మని చెప్పి, లోపలి గదిలోనికి వెళ్ళి పౌలు, సీలాల యెదుట సాగిలపడి "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ? అని అడిగెను. ప్రభువైన యేసునందు విశ్వాసముంచుము. అప్పుడు నీవును, నీయింటివారును రక్షణ పొందుదురు" అని వారతనికి జవాబిచ్చిరి (అపొ.కా. 16:31).

ఒకే ప్రశ్నకు మూడు రకములైన జవాబులు ఈయబడుట నీకు వింతగా లేదా ? ఆ ప్రశ్నలోని మాటలన్నియు ఒకే రీతిగ లేకపోయినను, పాపములో యున్న ఆత్మలు ఆ ప్రశ్నను అడిగిరి. "నేనెట్లు రక్షణ పొందగలను ?" అనునది వారి ముఖ్యోద్దేశమైయున్నది. క్రీస్తును హత్య గావించిరి యను నేరమును మోపబడినవారై "సహోదరులారా, మేమేమి చేతుము?" అని వారడిగారు. సౌలు ప్రభువు సన్నిధిలో కూల్చబడినవాడై అతడు చేసిన ఘోరపాపముల నెరిగినవాడై "ప్రభువా! నేనేమి చేయవలెను?" అని అడిగెను. ఫిలిప్పీ చెరసాల అధిపతి ఆ ఇద్దరు బోధకుల విషయమై పెద్దంత లక్ష్యము చేయలేదు. వారు ప్రార్థించుచు, పాటలు పాడుచుండగా ఖయిదీలు వినిచుండిరి గాని అతడు నిద్రించుచుండెను. అప్పుడు భూకంపము కలిగి చెరసాల తలుపులన్నియు తెరువబడెను, అందరి బంధకములు ఊడెను. వెంటనే చెరసాల అధిపతిలో గొప్ప మార్పు కలిగెను. ఖయిదీలందరు పారిపోయిరని అతడును కనుగొనెను గాని, "మేమందరము ఇక్కడనే యున్నాము" అని సౌలు అతనికి హామీయిచ్చెను. అతడు వణకుచు ఈ యిద్దరు బోధకుల యొద్దకు వచ్చి, "అయ్యలారా, రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను?" అని వారినడిగెను. ఈ మూడు ప్రశ్నలు వేరుగా ఏమియునులేవు. అయితే వారికీయబడిన జవాబులలో భేదమున్నట్లు ఎందుకు కన్పడుచున్నది ? వాటి నొకసారి చూడండి: ఒకటి మారుమనస్సు పొంది బాప్తిస్మము పొందుడి; రెండు-లేచి బాప్తిస్మము పొందుము; మూడు-ప్రభువైన యేసునందు విశ్వాస ముంచుము. రక్షింపబడుటకు మూడు మార్గములున్నవా ? మన రక్షణ మార్గాన్ని మనము ఎన్నుకొనగలమా ? కాదు, గాని ప్రశ్నలన్నియు ఒక్కటే, వాటి జవాబులు కూడ ఒక్కటే. ఈ సందర్భాలలో యున్న వాక్యాలను మనము జాగ్రత్తగా చదివితే అది మనకు విశదము కాగలదు.

## 4.

## ఒక ఉదాహరణ

దీనిని ఒక ఉదాహరణ ద్వారా మీకు విశదీకరించగోర్తాను : కాకినాడ నుండి హైదారాబాద్‌కు ఎంత దూరమున్నది ? యని నేనొకరిని అడిగాను. ఇంచుమించు 400 కిలోమీటర్లు అని అతడు నాకు జవాబిచ్చెను. నేను విజయవాడ వరకు వెళ్ళి హైదరాబాద్ ఎంత దూరమున్నది ? యని మరొకనిని అడుగుదును. అతడు నాకు వేరే జవాబు నిచ్చును. మరల కాజీపేట వరకు వెళ్ళి నేను ఆ ప్రశ్నను మరల అడుగుదును. మరల నాకు వేరొక జవాబీయబడును. హైదరాబాద్‌కు నేను చేరుకొను కొలది నాకీయబడిన జవాబులు వేరుగా ఉండును. అట్లే "రక్షణ పొందుటకు నేనేమి చేయవలెను ?" అను ప్రశ్నకీయబడిన జవాబులు కూడ. ఆ ప్రశ్న నడిగినవారు రక్షణ పొందుటకున్న దూరమును బట్టి వేర్వేరుగా యుండెను.

## చెరసాల అధిపతి

ఈ మూడు సందర్భాలలో యున్న వాక్యములను మనము ఇప్పుడు చదివి ఆ మూడు జవాబులలో యున్న ఏకత్వమును గ్రహించెదము. మొదటిగా మనము ఫిలిప్పియి చెరసాల అధిపతి మార్పునొందుటను పరిశీలింతుము. విమోచించు ప్రేమ పూర్వకమైన సువార్తను గూర్చి ఆ చెరసాల అధిపతి ఎన్నడు వినియుండలేదు. నేనేమి చేయవలెను ? అని అతడు అడిగినప్పుడు, అతడు విశ్వాసముంచవలెను అని అతనికి జవాబియ్యబడెను. అది ఎల్లప్పుడును ప్రధానమైనది. "వినుటవలన విశ్వాసము కలుగును, వినుట క్రీస్తును గూర్చిన మాటవలన కలుగును" (రోమా 10:17). ఇవి పౌలు యొక్క మాటలు కాదుగాని, రోమా 17వ అధ్యాయములో బోధించువారు లేకుండ ఎవరు వినలేరు అని పౌలు వివరించెను. అపొ.కా. 16వ అధ్యాయములోని తరువాత వచనములను మీరు నాతో చదివిన యెడల; ఫిలిప్పియి చెరసాల అధిపతి, తన కుటుంబము మార్పుజెందునప్పుడు నిజముగా ఏమి జరిగెనో మనము గ్రహించగలము. "వారు అతనికిని అతని యింటనున్న వారికందరికిని

దేవుని వాక్యము బోధించిరి." దేవుని వాక్యము బోధించునప్పుడు వారేమి బోధించిరి? సర్వలోకమునకు ఏమి బోధించవలెనని ప్రభువు కోరెనో దానినే, మొదటిగా మార్కు 16:15లో ప్రభువు ఆజ్ఞాపించిన రీతిగా వారు సువార్తను బోధించిరి. "మీరు సర్వలోకమునకు వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించుడి". ఆ సువార్తను బోధించుటలో ఒకడు నమ్మినంత మాత్రముననే రక్షింపబడునని వారు బోధించ లేదు, ఏలయనగా సువార్త బోధించునప్పుడు మారుమనస్సు కూడ ప్రకటింపవలెనని యేసు చెప్పెను (లూకా 24:46,47).

అతడు వారిని తీసికొనివచ్చి వారి గాయములను కడుగుటలో మారు మనస్సును అతడు పొందినట్లు వ్యక్తపరచెను. కొన్ని గంటల క్రితమే చెరసాలలోని లోపలిగదికి తాళమువేసి వాళ్ళ కాళ్ళకు బొండలను బిగించిన ఈ మనుష్యుని మనస్తత్వము ఇప్పుడు సంపూర్తిగ మారినది. తన ఖయిదీల గాయములను కడిగిన తరువాత వెంటనే అతడును, అతని ఇంటివారందరును బాప్తిస్మము పొందిరి అని లేఖనములు చెప్పుచున్నవి. అతడెందు నిమిత్తము బాప్తిస్మము పొందెను ? దేవుని వాక్యమతనికి ప్రకటింపబడెను. ఆ వాక్యము "నమ్మి బాప్తిస్మము పొందినవాడు రక్షింపబడును; నమ్మనివానికి శిక్ష విధింపబడును" అని చెప్పుచున్నది (మార్కు 16:16). అతడు క్రీస్తునందు విశ్వసించిన యెడల క్రీస్తు ఎందు నిమిత్తము బాప్తిస్మమునాజ్ఞాపించెనో అందు నిమిత్తము అతడు బాప్తిస్మము పొందెను. అతడు మార్పుజెందిన కథనము ఈ మాటలతో అంతమగుచున్నది: "మరియు అతడు వారిని ఇంటికి తోడు కొనివచ్చి, భోజనము పెట్టి, దేవునియందు విశ్వాసముంచిన వాడై తన ఇంటివారందరితో కూడ ఆనందించెను". దేవుని వాక్యమునకు విధేయత చూపిత తరువాత అతడు ఆనందించెను. విధేయత చూపించిన తరువాతనే అతని విశ్వాసము అంగీకరించబడెను గాని అంతకుముందు కాదు. బైబిలు అంతటిలోను అదే కనబడుచున్నది. ఇక్కడ ఏమి జరిగెనో దాని సారాంశమును ఇప్పుడు గమనింతము. మొదట అతడు విశ్వసించవలెను. ఆ వాక్యము నుండి

అతడు మారుమనస్సును గూర్చియు బాప్తిస్మమును గూర్చియు తెలిసికొనెను. ఆ క్రియలను అతడు తక్షణమే నెరవేర్చెను. అతడు దేవునియందు విశ్వాసముంచిన వాడై ఇప్పుడు ఆనందించెను.

## పెంతెకొస్తు నాటి ప్రజలు

పెంతెకొస్తు దినమున మార్పుజెందిన మూడువేల మందిని గూర్చి ఇప్పుడు మనము పరిశీలింతము. 12 మంది మనుష్యులపై పరిశుద్ధాత్మ బాప్తిస్మము జరిగియుండెను.120 మందిపై పరిశుద్ధాత్ముడు దిగెనని కొందరు అందురు గాని, పేతురు ఆ పదునొకరితో కలిసి నిలచి ఇట్లనెను : "మీరు ఊహించినట్లు వీరు మత్తులు కారు, ప్రొద్దు బొడిచి జామయిన కాలేదు" (అపొ.కా. 2:14,15). నేను పేతురు మాటలనే అంగీకరింతును. ఇంకా ఏమంటే అపొ.కా. 1:1-5లో యేసు ప్రభువు ఆ 12 మందికే దానిని వాగ్దానము చేసెను. పరిశుద్ధాత్ముడు వచ్చినప్పుడు ఎవరు బాప్తిస్మము పొందుదురో ఆయన ఎరుగును ప్రభువు యొక్క వాక్యమును మనకిచ్చు నిమిత్తము ఆ మనుష్యులు పరిశుద్ధాత్మ బాప్తిస్మమును పొందవలెను (యోహాను 14:26; 16:13-16). గాని ఇప్పుడు పేతురు ఇట్లనుచున్నాడు: "తన మహిమను బట్టియు, గుణాతిశయమును బట్టియు, మనలను పిలిచిన వాని గూర్చిన అనుభవ జ్ఞానమూలముగా ఆయన దైవభక్తి, జీవమునకును భక్తికిని కావలసిని వాటినన్నిటిని మనకు దయచేయుచున్నాడు" (2పేతురు 1:3). కొత్త నిబంధనలో పరిపూర్ణజ్ఞానమున్నది. పద్మాసుద్వీపకల్పము మీద ఆత్మావేశపు కలమునకు యోహాను స్వస్తి చెప్పిన నాటినుండి నైతిక, ఆత్మీయ సత్యము లేమియును కనుగొనబడలేదు. సరిగదా అతడు వ్రాసిన దానికి ఎవరయినను కలుపుట గాని, తీసివేయుటగాని చేయరాదని అతడు హెచ్చరిక నిచ్చెను. "ఈ గ్రంథమందున్న ప్రవచన వాక్యములను విను ప్రతివానికి నేను సాక్ష్యమిచ్చునది ఏమనగా-ఎవడైనను వీటితో మరి ఏదైనను కలిపిన యెడల, ఈ గ్రంథములో వ్రాయబడిన తెగుళ్ళు దేవుడు వానికి కలుగజేయును; ఎవడైనను ఈ ప్రవచన

గ్రంథమందున్న వాక్యములలో ఏదైనను తీసివేసిన యెడల దేవుడు ఈ గ్రంథములో వ్రాయబడిన జీవ వృక్షములోను, పరిశుద్ధ పట్టణములోను వానికి పాలు లేకుండ చేయును" (ప్రకటన 22:18,19). కాబట్టి పరిశుద్ధాత్మ బాప్తిస్మము యొక్క ప్రయోజనమును మనము గ్రహించగలము.

## పేతురు ప్రసంగము

యోవేలు ద్వారా ప్రవచింపబడినది నెరవేరెను అని పేతురు ప్రసంగించెను. అంతేగాక అక్కడ గుమిగూడిన వేలకొలది యూదులకు అతడు సువార్త ప్రకటింప మొదలిడెను. తన ప్రసంగమును ముక్కు సూటిగను ఈ మాటలతో అతడు ఆరంభించెను : "ఇశ్రాయేలు వారలారా, యీ మాటలు వినుడి. దేవుడు నజరేయుడగు యేసు చేత అద్భుతములను, మహత్కార్యములను, సూచక క్రియలను మీ మధ్యను చేయించి, ఆయనను తన వలన మెప్పు పొందిన వానిగ మీకు కనబరచెను : ఇది మీరే ఎరుగుదురు. దేవుడు నిశ్చయించిన సంకల్పమును ఆయన భవిషద్ జ్ఞానమును అనుసరించి అప్పగింపబడిన యీయనను మీరు దుష్టులచేత సిలువ వేయించి చంపితిరి. మరణము ఆయనను బంధించి యుంచుట అసాధ్యము గనుక దేవుడు మరణవేదనలు తొలగించి ఆయనను లేపెను" (అపొ.కా. 2:22-24). పునరుత్థానము పాతనిబంధనలో ప్రవచింపబడె ననియు, వారందరు యేసుయొక్క పునరుత్థానమునకు ఆరోహణమునకు సాక్షుల మనియు పేతురు ప్రసంగించెను. అతడు తన ఉపన్యాసమును ఈ మాటలతో ముగించెను : "మీరు సిలువవేసిన ఈ యేసునే దేవుడు ప్రభువుగాను, క్రీస్తుగాను నియమించెను. ఇది ఇశ్రాయేలు వంశమంతయు రూఢిగా తెలిసికొనవలెను" (అపొ.కా. 2:36). విశ్వసించిన వారి హృదయములనుండి ఇప్పుడు ఈ ప్రశ్న వచ్చుచున్నది : "సహోదరులారా మేమేమి చేతుము?" ఇంతకుముందు ఈ ప్రశ్న ప్రసంగమయిన తరువాత వచ్చినది. అందువలన వారీ ప్రశ్నను వేశారు. అంటే వారి విశ్వాసాన్ని వెల్లడ పర్చారు అని వ్యక్తమగుచున్నది. దానిని పేతురు

అట్లు గ్రహించెను. ఆత్మచే నడిపింపబడుచున్న యతడు, వారు విశ్వసించిరి గనుక అది సరిపోవునని చెప్పలేదు కాని "మీరు మారుమనస్సు పొంది పాపక్షమాపణ నిమిత్తము ప్రతివాడును బాప్తిస్మము పొందుడి; అప్పుడు మీరు పరిశుద్ధాత్మ అను వరముమ పొందుదురు" అని పరిశుద్ధాత్ముడు అతనిచే పలికించెను (అపొ.కా. 2:38).

"నేనేమి చేయవలెను?" అను ప్రశ్నకీయబడిన రెండు జవాబులను ఒక్కసారు పరీక్షింతము. మొదట వారు ప్రసంగమును వినిరి. విశ్వసించిరి, మారుమనస్సును వ్యక్తపరచిరి. బాప్తిస్మము పొందిరి. రెండవదిగా వారు ప్రసంగమును వినిరి. ప్రశ్నించుట ద్వారా విశ్వాసమును వ్యక్తపర్చిరి. మారుమనస్సు పొంది బాప్తిస్మమును పొందవలెనని బోధింపబడిరి. అన్ని సంగతులను కలిపినప్పుడు వారికీయబడిన జవాబులలో వ్యత్యాసమేమియును లేదు; అయితే హైదరాబాద్‌కు వెళ్ళే ఉదాహరణలో వలె వారికీయబడిన జవాబు వేరుగ యుండెను. అయుతగా వారు వేర్వేరు స్థితులలో యుండిరి. మొదటి సందర్భములో దేవుని వాక్యము ప్రకటింపబడకముందే ప్రశ్న వేయబడెను. గనుక వారికొక జవాబీయబడెను; రెండవ సందర్భములో ప్రసంగము ముగిసిన తరువాత ప్రశ్న వేయబడెను గనుక వేరొక జవాబీయబడెను.

## తార్సువాడైన సౌలు

ఇప్పుడు మూడవ జవాబును గమనింతము. "లేచి ఆయన నామమును బట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది నీ పాపములను కడుగుకొనుము" అను జవాబీయబడెను (అపొ.కా. 22:16).

అననీయ సౌలునొద్దకు వచ్చినప్పుడు విశ్వసించుము అని అతడు సౌలుకు చెప్పలేదు కాని అతనికి మార్గములో కన్పడు ప్రభువు అతని పంపెననెను. ఈ సందర్భములో నీవు విశ్వసించవలెను అని సౌలుకు చెప్పుటలో కలుగు ప్రయోజన

మేమి ? అతనిని గ్రుడ్డివానిగ చేసిన మహిమను అతడెరుగడా ? అతడు దృఢముగా విశ్వసించెనని అతని జీవితమే గొప్ప సాక్ష్యమిచ్చుచున్నది. ఆ బోధకుని యెదుటను, క్రీస్తు యెదుటను ఉన్న ఋజువును బట్టి అతడు మారుమనస్సు పొందెనని వ్యక్తమగుచున్నది గనుక అతడు మారుమనస్సు పొందవలెనని చెప్పనవసరములేదు. మొదటిగా క్రైస్తవులను హతము చేయు నిమిత్తము అతడు దమస్కునకు వచ్చెను, గాని అతడా క్రియను జరిగించుటలేదు. రెండవదిగా, అతడు పట్టణములో ప్రవేశించినది మొదలు ఏమియు తిని, త్రాగలేదు. అతని సమయమునంతటిని ప్రార్థనలో గడిపెను. ఇదియు కూడ అతని మారుమనస్సును వ్యక్తపర్చుచున్నది. అప్పుడు ఆ బోధకుడు వచ్చి ఆ ఆఖరి మెట్టును దాటవలెనని అతనికిట్లు చెప్పెను: "గనుక నీవు ప్రార్థనచేసి, బాప్తిస్మము పొంది నీ పాపములను కడుగుకొనుము" (అపొ.కా. 22:16).

చివరి సమీక్షలో ఈ మూడు జవాబులు ఒకే రీతిగ యున్నవని మనము గమనించగలము. జవాబును వెదకువాడు రక్షణకు ఎంత సమీపములో యున్నాడో దానిని బట్టి అతనికి జవాబీయబడెను. నీవు దేవుని వాక్యము ఎరుగకుండిన యెడల ఎవరినైనా నీకు బోధించమని కోరుము లేదా ఆదిమ బోధకులు అపొస్తలుల కార్యములో బోధించిన వాటిని చదువుము. యేసు దేవుని కుమారుడని నీవు విశ్వసించిన యెడల, మారుమనస్సు పొంది, పాపక్షమాపణ నిమిత్తము బాప్తిస్మము పొందుము. నీవు విశ్వసించి, నీ పాపముల నిమిత్తము మారుమనస్సు పొందియున్న యెడల, నీవు తడువు చేయుట యెందుకు ? లేచి ఆయన నామమునబట్టి ప్రార్థన చేసి బాప్తిస్మము పొంది పాపములను కడుగుకొనుము.

## ప్రతివారు లోబడాలి

అందరు యేసుక్రీస్తు యొక్క అధికారమునకు లోబడవలెను. ప్రతివాడును ఆయనకీయబడిన పరిపాలన హక్కును అంగీకరించవలెను. "నాతోడు,

ప్రతిమోకాలును నా యెదుట వంగును, ప్రతి నాలుకయు దేవుని స్తుతించును అని ప్రభువు చెప్పుచున్నాడు" (రోమా 14:11). ఆయన అధికారమును ఎప్పుడు ఒప్పుకొనవలయునో ఆ నిశ్చయత మనకు ఈయబడి ఉన్నది. కృపాద్వారము లింకను తెరువబడి యుండగా మనమా క్రియను ఇప్పుడు చేయగలము. లేదా తీర్పు దినము వరకు కనిపెట్టి భరింపరాని సిగ్గుతో ఆ క్రియను చేయగలము.

మానవుడు పాపములో నశించకపోయిన యెడల యేసు చనిపోనవసరము లేదు. మనము మనమ్మే రక్షించుకొనగలిగిన యెడల, ఆయన మరణించుట వ్యర్థమే. మనకు రక్షకుడవసరమయినందున దేవుడు రక్షకుని మనికిచ్చెనని నమ్ముచు మనమాయన అధికారమునకు లోబడుదుము. "ఆయన సంపూర్ణసిద్ధి పొందినవాడై తనకు విధేయులైన వారి కందరకు నిత్యరక్షణకు కారకుడాయెను" (హెబ్రీ 5:10).

ఈ రోజు మీ ఆత్మ అడుగగలిగిన బహు ప్రాముఖ్యమైన ప్రశ్నకు ఆయన జవాబునిచ్చెను. ఆయన జవాబును మీరు అంగీకరింపవలెనని మిమ్మును కోరుచున్నాను.. మీరు తడవు చేయవద్దు. అపొస్తలుడైన పౌలుతో కూడ మీకు ఈ హెచ్చరిక నిచ్చుచున్నాను : "నేడు మీరాయన శబ్దమును వినినయెడల మీ హృదయములను కఠినపరచు కొనకుడి". ఇదిగో ఇదియే అనుకూల సమయము, ఇదే రక్షణదినము".

ఈ ప్రసంగ పాఠమును మీకు అందించు తరుణమును ఇచ్చిన దేవునికి మేము కృతజ్ఞత చెల్లించుచున్నాము. ప్రోత్సాహకరమైన అనేక సందేశములను మీరు పంపినందుకై మా కృతజ్ఞతలు. ప్రేమ, దయ, సత్యము మనలో ఎల్లప్పుడు నిలుచును గాక, ఆయన వచ్చువరకు ఆయన బయలు పరచిన రీతిగ మనము ఆయనను సేవించెదము గాక !

\- జె.సి. బెయిలీ

11.

# సంస్కరణోద్యమము వరకు కేథలిక్కుల చరిత్ర

## (History of Catholicism leading to Reformation)

"నేను వెళ్లిపోయిన తరువాత క్రూరమైన తోడేళ్లు మీలో ప్రవేశించునని నాకు తెలియును; వారు మందను కనికరింపరు. మరియు శిష్యులను తమ వెంట ఈడ్చుకొని పోవలెనని వంకర మాటలు పలుకు మనుష్యులు మీలోనే బయలు దేరుదురు. కావున......... మీరు జ్ఞాపకము చేసికొని మెలకువగా ఉండుడి" (అపొ.కా. 20:29-31).

పరిచయము : గత సంచికలో రోమన్ కేథలిక్కుల గుత్తాధిపత్యము ఒక గొప్ప రాజకీయ శక్తిగా మారి అది దాని స్వంత సైన్యమును కలిగియుండినట్లు గమనించాము. క్రీ॥శ॥ 1809లో దాని సైన్యములు చిత్తుగా ఓడింపబడెను, దాని రాజకీయ శక్తి సంకుచితము చేయబడెను. మనము చరిత్ర పుటలలోనికి వెళ్లి ప్రొటెస్టెంటుల సవరణోద్యమమునకు దారితీసిన సంఘటనలను పునరాలోచించ వలసిన అవసరత ఎంతైనా యున్నది. కేథలిక్కుల హింసాత్మక చర్యలు, అసహనము వలన ప్రతిఘటన ప్రారంభమాయెను. నాలుగవ శతాబ్దములో తియొడొసియస్ ఆధిపత్యములో సంఘము హింసాత్మక చర్యలు ప్రారంభించెను. అటు తరువాత వచ్చిన పోపులు మరింత అసహనపరులైరి. పోప్ బోనిఫేస్ అను నతడు, "ఆత్మీయ, భౌతిక ఖడ్గములు రెండును సంఘము యొక్క అధికారములో ఇమిడి యున్నవే, ఒకటి నిజముగా సంఘము కొరకు, మరొకటి సంఘము వలన ఝుళిపించబడ వలసినవే"యని చెప్పిన మాటను మనము గమనించవచ్చును. యిది రోమన్ కేథలిక్కు సంఘము యొక్క సిద్ధాంతము. తనకు తానుగా ఆపాదించుకొనిన ఈయధికారము వలన పోపులు ఎంత పలుకుబడిని, అధికారమును కలిగి యుండిరో మనము గమనించుకోవచ్చును. అందువలననే కేథలిక్కు సంఘ చరిత్ర రక్తపాతమైనది, అవినీతితో కూడినట్టిది. అది దేవుని బోధకాదు. "యేసు నీ కత్తి

వరలో తిరిగి పెట్టుము ; కత్తి పట్టుకొను వారందరు కత్తి చేతనే నశింతురు" అని పేతురుతో చెప్పెను (మత్తయి 26:52). అయితే రోమన్ కేథలిక్కుల మతము ఖడ్గముతో వ్యాపింపచేయబడెను.

ఈ పాఠములో రోమన్ కేథలిక్కుల ఆధిపత్యానికి, కల్మషానికి వ్యతిరేకత ప్రదర్శించిన వ్యక్తులను, గుంపులను గుర్తించి వారు ఏయే అంశాలను ప్రతిఘటించిరో తెలిసికొందము. ఈ ప్రతిఘటన సందర్భములను మనము 7వ శతాబ్దము వరకు గుర్తించవచ్చును. అయితే 11వ 12వ శతాబ్దముల వరకు కూడ యివి తీవ్రస్థాయికి చేరుకోలేదు. మరియు 16వ శతాబ్దము వచ్చువరకు కూడ ప్రొటెస్టాంటుల సవరణోద్యమము (Reformation Movement) ఆరంభించుటకు తగినంత శక్తి చేకూరలేదు. కేథలిక్కుల మతము కొద్ది సంవత్సరములలోనే ఎట్లు ఉద్భవింపలేదో అట్లే దానిని సవరించే ఉద్యమము కూడ అకస్మాత్తుగా ఉద్భవింపలేదు.

**7వ శతాబ్దము :** పౌలీషియన్లు (Paulicians)

వీరు యూఫ్రటీసు ప్రాంతములో యున్న ఒక క్రైస్తవ గుంపువారు ఆర్మేనియా, ఆసియా ప్రాంతములలో వ్యాపించిరి. వారు తూర్పు ప్రాంతపు ప్రొటెస్టాంటులని పిలువబడి, బోధకులలో అవినీతిని ఖండించిరి.

**9వ శతాబ్దము :** ట్యురిన్‌కు చెందిన క్లాడియస్, ఇటలీలో ట్యురిన్ పట్టణపు బిషప్పు, స్పెయిన్ దేశస్థుడు (Claudius of Turin, Spanish bishop of Turin, Italy)

అతడు

1. ప్రతిమారాధనను
2. మృతుల కొరకు ప్రార్థనలను
3. పరిశుద్ధుల ఆరాధనను

4. సిలువారాధనను
5. మరియారాధనను
6. సిలువ గుర్తులను మొదలగు వాటిని ఖండించెను

అతని గతి ? యేమాయెనో తెలియదు.

**10వ శతాబ్దము :** బల్గేరియాకు చెందిన బొగొమిల్స్ అను ఒక గుంపు (Bogomils, a Bulgarian group)

వీరు "దేవుని మిత్రులనే" పేరు గలవారు.

1. వారు ప్రతిమారాధన విగ్రహారాధనయే యని దాని ఖండించారు.
2. ప్రభురాత్రి భోజనమును నిరాకరించారు.
3. అలంకారరీతిలో యున్న లేఖనముల భావార్థమును విపరీత విధానములో అంగీకరించారు.
4. వారి గతి ? క్రీ॥శ॥ 1111లో కామెనెస్ అను వాని చేతిలో గొప్ప జన సమూహములు ఖడ్గము వలన వధింపబడిరి.

**11వ శతాబ్దము** కేథరీలు అనువారు (Cathari)

వారు "పవిత్రులని" పిలువబడేవారు.

1. జీవన విధానం సన్యాసుల వంటిది.
2. లేఖనముల యెడల ఎనలేని గౌరవం, భక్తి కల్గియుండిరి.

   వారి గతి ? 12వ శతాబ్దములో ఆల్బిజెన్సెస్‌కు జరిగిన దానిని గమనించుము.

**12వ శతాబ్దము :** బెగ్హార్డ్స్ అనువారు (Beghards)

వీరు నెదర్లాండులో మఠములలో జీవించుచుండిన సహవాసులు. ప్రార్థనా పరులు. కొన్ని మఠాలలో వేలకొలది స్త్రీలుండేవారు. పురుషులు కేథలిక్కు సంఘము యొక్క దండయాత్రలలో పాల్గొనేవారు :

వారి గతి ? వారు హింసలు పాలైనట్లు పెద్దగా ఎక్కడా కనబడదు.

**12వ శతాబ్దము : ఆల్బీజెన్సెస్ అనువారు (Albigenses)**

కేథారీలనబడు వారినుండి ఉద్భవించిన వారు. ఫ్రాన్స్‌లోను, ఇటలీలోను అనేకమంది వీరిని వెంబడించిరి.

వారు

1. లేఖనములను బాగుగా అవలంబించిరి.
2. తమ్మును తాము తగ్గించుకొని జీవించిరి.
3. నైతిక పవిత్రత కొరకు గొప్ప ఆసక్తి కలిగియుండిరి.
4. వారి కాలములో స్వాములనబడేవారిని నిరాకరించిరి.
5. ప్రతిమారాధనను, పరిశుద్ధుల ఆరాధనను ప్రతిఘటించిరి.
6. పవిత్ర స్థలముల యాత్రలను వ్యతిరేకించిరి.

వారి గతి ? వారి ప్రతిఘటనను బట్టి క్రీ॥శ॥ 1208లో పోప్ ఇన్నోసెంట్ III అనునతడు వారిపై దండయాత్ర జరిపెను. ఆ దండయాత్ర 20 సంవత్సరముల మట్టుకు జరిగెను. పట్టణము వెంబడి పట్టణము ఖడ్గమయమాయెను. లింగభేదము, వయసు భేదము లేకుండా ఆ పట్టణముల నివాసులు హతము చేయబడగా ఈ గుంపువారు సమూల నాశనము గావించబడిరి. కేథలిక్కు దండయాత్ర కారులు "అందరినీ వధించుడి. దేవుడు తనవారి నెరుగును" అను నినాదమును పురస్కరించు కొని, ఒక్క దండయాత్రలోనే 40,000 మందిని హతము గావించిరి. (Halley Page 892).

**12వ శతాబ్దము : బ్రైస్‌కు చెందిన పీటర్ అనునతడు. (Peter of Bruys)**

ఇతడు ఫ్రాన్స్‌లో దక్షిణ భాగమున సువార్త ప్రకటించెను. క్రొత్తనిబంధనయే సర్వాధికారము గలది యని అతడు విశ్వసించెను.

అతడు

1. శిశు బాప్తిస్మమును
2. రొట్టె ద్రాక్షారసములు నిజముగా క్రీస్తు శరీర, రక్తముగా మారునను సిద్ధాంతమును
3. స్వాముల వారు చేయు పూజను లేక ఆరాధనమును (Mass)
4. పారంపర్యాచార పద్ధతి ప్రకారమైన ఆరాధనను
5. మృతుల కొరకైన ప్రార్థనలను వ్యతిరేకించెను.

అతని గతి ? దేవ దూషకుడను నెపముతో అతడు కాల్చి చంపబడెను.

**13వ శతాబ్దము : వాల్డెన్సెస్ అనువారు (Waldenses)**

పీటర్ వాల్డో అనువానిచే స్థాపించబడెను. అతడు 13వ శతాబ్దపు ఆరంభములో కేథలిక్కు సంఘమునకు వ్యతిరేకముగా ఒక ఉద్యమము నారంభించెను. విశ్వాస సంబంధ విషయాల్లో బైబిలే సంపూర్ణాధికారి యని బోధించిరి.

వారు :

1. మృతుల కొరకు పూజలు చేసి వారిని పరదైసుకు పంపవచ్చు అనే సిద్ధాంతమును వ్యతిరేకించిరి.
2. మృతుల కొరకు ప్రార్థనలను వ్యతిరేకించిరి.
3. ఆచార కర్మలు, స్వాములవారి పూజలు మొదలైనవి వ్యతిరేకించిరి.

వారి గతి? వెరోనాలో యున్న కేథలిక్ సినడ్ వారిని శాపగ్రస్థులని ప్రకటించి, స్త్రీలను, పురుషులను పసిపిల్లలను "క్రీస్తు నామమున" వధించి వేసిరి (Halley Page 892).

గమనిక : ఇట్టి అనేక గుంపులను బట్టియు, ఉద్యమములను బట్టియు కేథలిక్కుల మతమునకు విరుద్ధముగాయున్న బలమైన సాక్ష్యమును మనము

కనుగొనగలము. వారు పలుసంగతుల కొరకు పోరాడినా, రోమన్ కేథలిక్కు స్వాముల నుండి వేరుగా యుండే జీవనము కొరకు, ఆరాధన కొరకు నిలబడిరి. అంతేగాకుండా, సామాన్య ప్రజల భాషలో బైబిలు లభ్యమగుట వలన యిట్టి భావములు చిగురించినవి. వారు సూక్ష్మమైన భక్తి పూరిత జీవితమును కోరుకొనిరి. అయితే పోపులైన వారందరు వారిని ఖండించలేదు. గాని ఖండించిన పోపులు లక్షలాది ప్రజలను "ధర్మ విచారణ" యను నెపముతో చంపించిరి. (ధర్మవిచారణ (Inquistiton) అను దానిని పోప్ ఇన్నోసెంట్ III అనునతడు మొదలు పెట్టెను, కొందరు స్వాములను ఒక గుంపుగా చేసి దేవదూషణ చేయు వారికి విచారణ కర్తలుగా అతడు నియమించి అట్టివారిని ఏరివేసెను).

## II కేథలిక్కు సంఘము లోపలినుండి తిరుగుబాటు

**13వ శతాబ్దము :** పడువా వాస్తవ్యుడగు మార్సిలియస్ అనునతడు (Marsilius of Padua)

అతడు వృత్తిరీత్యా వైద్యుడు.అన్నిటిలోను బైబిలే ముఖ్యమని అతడు బోధించాడు.

1. గురువులందరు సమానులేయని అతడు బోధించాడు.
2. పోప్, బిషప్పు అను పదవులు మానవ కల్పితములే యన్నాడు.
3. అది దేవుని తీర్పు అయితే తప్ప, కేథలిక్కు గురువు ఎవరినైనా బహిష్కరింపతగదని అతడు బోధించాడు.

**14వ శతాబ్దము :** అక్కాం వాస్తవ్యుడైన విలియం అనునతడు (William of Accam)

ఫ్రాన్స్ దేశపు విద్యాధికారి, మరియు పండితుడు.

1. పోపు పొరబడనివాడు కాదను దానిని ఖండించాడు.

2. గురువుల సభలు కూడ పొరబడనివారు కాదను దానిని ఖండించాడు.
3. చక్రవర్తులపై పోపులకు అధికారమున్నదను దానిని ఖండించాడు.

**14వ శతాబ్దము : జాన్ విక్లిఫ్ (John Wyclif)**

ఆంగ్ల సంస్కరణోద్యమము యొక్క ఉదయ నక్షత్రమని అతడు పిలువబడెను. 1382లో బైబిలు నంతటిని ఇంగ్లీషు భాషలోనికి తర్జుమా చేసి ముగించెను.

1. బైబిలే సర్వ శ్రేష్టమైన అధికారము గలదియని అతడు వాదించాడు.
2. పోపు క్రీస్తు విరోధియని ప్రకటించాడు.
3. బైబిలును చదువుకొనే హక్కు ప్రజలందరికీ యున్నదని వాదించాడు.
4. అతడు పాపక్షమాపణ పత్రముల విక్రయమును, ప్రభురాత్రి భోజనములో రొట్టె ద్రాక్షారసములు క్రీస్తు యొక్క రక్తమాంసములుగా మారునను దుర్బోధను, లౌకికముగా యున్న కేథలిక్కు గురువులను ఖండించాడు.

అతని గతి ? కక్ష కొలదీ, కేథలిక్కులు అతని గ్రంధములను కాల్చివేసిరి. అతడు చనిపోయిన 30 సంవత్సరముల తరువాత అతని సమాధిలోని అవశేషములను వెలికితీసి, కాల్చి, బూడిద చేసి నదులలో పారవేసిరి (Mynard page 44).

**14వ శతాబ్దము : లోలార్డ్స్ అనువారు (Lollards)**

విక్లిఫ్ చేయుచున్న బోధకు సానుభూతి పలికిరి. అయితే హెన్రీ VI చక్రవర్తి కాలములో కేంటర్‌బరీ ఆర్చ్ బిషప్ ఆధ్వర్యమున అనేకులు చంపబడిరి.

**14వ శతాబ్దము : జాన్ హస్ (John Huss)**

బొహిమియాకు చెందిన బోధకుడు, అతడు ప్రాగ్ యూనివర్సిటీకీ రెక్టార్‌గా పని చేసెను. ఆ కాలమందు అది గొప్ప విద్యాసంస్థ.

1. అతడు పోపుల యొక్కయు, గురువుల యొక్కయు అధికారమును వ్యతిరేకించెను.
2. కేథలిక్కు సంఘము యొక్క నైతిక భ్రష్టత్వమును ఖండించెను.
3. పాపక్షమాపణ పత్రముల విక్రయమును ఖండించెను.
4. పర్గటెరీ సిద్ధాంతమును వ్యతిరేకించెను.
5. ఆరాధనలో ప్రతిమలను వ్యతిరేకించెను.

అతని గతి ?ప్రాగ్ యూనివర్సిటీ రెక్టార్ యొక్క ఉద్యోగమునుండి డిస్మిస్ చేయబడెను. మరియు

- అతని గ్రంధములు కాల్చివేయబడెను.
- వెలివేయబడెను.
- చెరసాలలో బంధింపబడి ఏడు మాసముల మట్టుకు ఘోరముగా హింసింపబడెను.
- 1415లో కాన్స్టాన్స్‌లో జరిగిన కౌన్సిల్ అతనిని సజీవ దహనము చేయవలెనని తీర్మానించెను. ఆ పనిగావించెను.
- జాన్ హస్ యొక్క అనేకమంది అనుచరులు కూడ క్రైస్తవ్యము పేరునే చంపబడిరి.

**15వ శతాబ్దము : జెరోమ్ సావొనరాలా (Jerome Savonarola)**

ఇటలీ దేశములో ఫ్లారెన్స్ పట్టణస్థుడు కేథలిక్కు సన్యాసి, గొప్ప సంస్కరణోద్యమకారుడు, గొప్ప బోధకుడు. అతని ప్రసంగములను వినుటకు పదివేలమంది గంటల తరబడి కనిపెట్టుచుందురు. అతడు :

1. పోపుల దౌష్ట్యమును, కామాతురతను ఖండించెను.
2. పోపులు పొరబడని వారుకారను దానిని ఖండించెను.
3. కేథలిక్కుల సిద్ధాంతమును వ్యతిరేకించెను.

అతని గతి ? పోప్ అలెగ్జాండర్ VI అనునతడు అతని చెరసాలలో వేయించి, హింసించి, మరణశిక్ష విధింపజేసెను.

- అతడు ఉరితీయబడెను, అతని శవము కాల్చివేయబడి, బూడిద నలుమూలలా ఎగురవేయబడెను.
- "క్రీస్తు ప్రతినిధి" యైన పోపువలన అతని అనుచరులు ఘోరముగా హింసింపబడిరి (Halley. Page 893).

**15వ శతాబ్దము : జాన్ రూష్లిన్ (John Reuchlin)**

ఇతడు గొప్ప జర్మన్ పండితుడు. సవరణోద్యమమునకు దారి తీసినవాడు.

**15వ శతాబ్దము : ఇరాస్మస్ (Erasmus)**

కాలాలన్నిటిలోను గొప్ప పండితుడు. అతని వ్రాతలు సవరణోద్యమము నకు గొప్పగా సహకరించెను. కేథలిక్కు సంఘమును అంతరంగికముగా సవరించాలనేది అతని ఉద్దేశ్యము. సవరణోద్యమ కాలములో అనేకులు కేథలిక్కు సంఘమును విడనాడుచుండగా అట్లు చేయుటకు అతడు నిరాకరించెను. లేఖనముల తట్టు ప్రజలు మరలి రావాలని అతడు బోధించెను. అతడు :

1. మధ్య యుగములో యున్న కేథలిక్ సంఘమునకు, దాని పారంపర్యా చారములకు వ్యతిరేకముగా బోధించెను.
2. దాని గురువులకు వ్యతిరేకముగా బోధించెను.

అతని గతి ? కేథలిక్కులు, ప్రొటెస్టాంటులు కూడ అతని ఎదురాడిరి; అతడు ధైర్యశాలి కాదని నిందించిరి.

**16వ శతాబ్దము : విలియం టిండేల్ (William Tyndale)**

అతడు కేథలిక్కు సన్యాసత్వమును విసర్జించెను. బైబిలును ఆంగ్లము లోనికి తర్జుమా చేసెను. కేథలిక్కు స్వామియొకడు అతని ఒకసారి

దూషించగా, "దేవుడు నాకు ప్రాణమిస్తే, కొన్ని సంవత్సరములలోనే భూమిని దున్నే బాలునికి నీకంటే ఎక్కువ బైబిలు జ్ఞానము కలిగేలాగున చేయుదునని" అతడు జవాబిచ్చెను.

అతని గతి ?

1. కేథలిక్కు సంఘము తీవ్రముగా అతనిని ప్రతిఘటించెను.
2. దేవదూషకుడని అతనికి తీర్పు చెప్పి, పీక నులిమి చంపబడి, కొయ్యకు కట్టబడి అతడు కాల్చివేయబడెను (Maynard. Page 45).

ముగింపు :

1. ఈ రీతిగా కేథలిక్కు సంఘములో యున్న అవినీతికి, దాని గురువులకు వ్యతిరేకముగా గొప్ప అసంతృప్తి ప్రజలలో నెలకొల్పబడెను.
2. దాని ఘోరమైన హింసాత్మక క్రియల వలన గొప్ప ప్రతికూలత ఏర్పడెను.
3. రాజకీయ నాయకులు, పాలకులు తమ ఏలుబడిలో పోపులు తరుచు కలుగ జేసికొనుట వలన విసుకుజెందిరి.
4. లేఖనముల తట్టు తిరుగుదుమని ప్రజలలో కాంక్ష పెల్లుబికెను. ఇట్టి సందర్భములో నాయకత్వము వహించుటకు ఒక వ్యక్తిగాని, కొందరు వ్యక్తులుగాని ముందుకు రావలసియుండెను. సవరణోద్యమము ఆసన్నమాయెను.

# ఆరాధించుటలో ఆనందము

## (Gladness in Worship)

"దుప్పి నీటివాగులకొరకు ఆశపడునట్లు దేవా, నీ కొరకు నా ప్రాణము ఆశపడుచున్నది" (కీర్తన 42:1). ప్రతి క్రైస్తవుడు దేవుని ఆరాధించుటలో ఆసక్తి కలిగియుండును. దావీదు దేవుని ఆరాధించుటలో నిలకడగా యుండెను; సమర్పించుకొనెను. "యెహోవా మందిరమునకు వెళ్లుదమని జనులు నాతో అనినప్పుడు నేను సంతోషించితిని" యని అతడు చెప్పెను (కీర్తన 122:1). దావీదు

ఆరాధన చేసిన దేవుని మందిరము ఒక గుడారము. ఇశ్రాయేలీయులు ఒక స్థలమునుండి వేరొక స్థలమునకు కదులుచున్నప్పుడు తమ ఆరాధన స్థలాన్ని (మంది రాన్ని) తమతో కూడ తీసుకొని వెళ్ళేవారు. సొలొమోను దేవాలయాన్ని నిర్మించేవరకు దేవుని ప్రజలకు ఆరాధనచేసే ఒక నికరమైన స్థావరములేదు. దేవాలయము నిర్మించబడేవరకు దేవుడు ప్రత్యక్ష గుడారములో యుండెను.

ఈనాడయితే దేవుని మందిరమే దేవుని సంఘము (1తిమో3:15). సంఘము ఒక ఆలయము లేక గుడికాదుగాని ""దేవుడు తన స్వరక్తమిచ్చి సంపాదించిన" వ్యక్తులతో కూడియున్నది. వారే సంఘము (అపొ.కా. 20:28).

సమరయ స్త్రీ యేసుతో, "మా పితరులు ఈ పర్వతమందు ఆరాధించిరి గాని ఆరాధింపవలసిన స్థలము యెరూషలేములో ఉన్నదని మీరు చెప్పుదురని అనెను" (యోహాను 4:20). సరియైన రీతిగ యేసు ఆమె ప్రశ్నలకు జవాబిచ్చిన తరువాత ఆయన ఇట్లనెను: "అయితే యథార్థముగా ఆరాధించువారు ఆత్మతోను సత్యముతోను తండ్రిని ఆరాధించు కాలము వచ్చుచున్నది; అది ఇప్పుడును వచ్చేయున్నది, తన్ను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు (యోహాను 4:23). మానవుడు దేవుని ఆరాధించే ఒకే ఒక్క నిరీత స్థలము ఇకలేదు. ఆరాధించుటకు దేవుని ప్రజలు ఎక్కడ కూడియుందురో అదే ఆరాధన స్థలము.

ఆదిమ సంఘస్థులు "అపొస్తలుల బోధయందును, సహవాసమందును, ప్రార్థన చేయుటయందును ఎడతెగకయుండిరి" (అపొ.కా. 2:42). మనము జీవించుచున్న క్రైస్తవయుగంలో దేవుని ప్రజలు స్థానిక సమాజములలో లేక సంఘములలో (Local Congregations). ఆయనను సేవించాలని దేవుడు సంకల్పించాడు (1కొరింథీ 1:1, 2కొరింథీ 1:1). క్రీస్తుసంఘ సభ్యులు స్థానిక సంఘములో నమ్మకముగా లేనియెడల సంఘము సరిగా పనిచేయలేదు, అభివృద్ధి జెందలేదు, గొప్పసంఘము కాలేదు.

ప్రభువును ప్రేమించుటలో మనము పెరగాలి. దావీదువలె మనము దేవుని మందిరానికి వెళ్లడానికి ఎల్లప్పుడు సంతోషించాలి. ఈ సంతోషానందాలను యితరులతో పంచుకొనడానికి ఆశ కలిగియుండాలి. వారిని ఆరాధన కూటాలన్నిటికి తీసికొని రావాలి. మనలో ప్రతివాడు ఆరాధనకు వెళ్ళేటప్పుడు ఇంకొకరిని తీసుకొని వెళ్ళాలి. అట్లయితే ఎంత బావుంటుందో తెలుసా?

- **W.** ఎడ్విన్ క్లియరీ.

# పరలోకం వెళ్ళేవారెవరు ?

## (Who is going to Heaven ?)

-సంక్షిప్త ప్రసంగము-

పరిచయం :

1. ప్రకటన 21:1-7, 22-27; 22:1-5

2, పరలోక సౌందర్య మహిమలు

   a) పరిపూర్ణ ఆనందము

   b) అత్యంత సౌందర్యము గల ప్రదేశమది. సువర్ణవీధులు, సూర్యకాంతములతో కట్టబడిన ప్రాకారము మొదలుగనవి కలవు.

   c) దానిలో ప్రకాశించుటకై సూర్యుడైనను చంద్రుడైనను దానికక్కరలేదు. దేవుని మహిమయే దానిలో ప్రకాశించును.

   d) దుఃఖమైనను ఏడ్పయినను అక్కడ ఉండదు.

   దేవుడు ప్రతి బాష్పబిందువును తుడిచివేయును.

   మరణము ఇక ఉండదు.

   దుఃఖమైనను, ఏడ్పయినను వేదనయైనను ఇక ఉండదు.

3. మనలో ప్రతివాడు పరలోకానికి వెళ్ళునట్లు ప్రయత్నించాలి.

పరలోకమునకు వెళ్ళనివారు :

1. శరీర కార్యములను జరిగించువారు (గలతీ 5:19-21).

2. మంచివారనిపించుకొన్న వారందరు వెళ్ళలేరు.

a) మంచితనం ఒక్కటే సరిపోదు. అదొక్కటే మనల్ని మోక్షానికి తీసుకువెళ్ళదు.

b) ఉదా : కొర్నేలి. అపొ.కా. 10:1-8, 19-22; 11:14

3 భక్తిగలవారమనుకొను వారందరు వెళ్ళలేరు.

a) మత్తయి 7:21-23

b) ప్రకటన 22:14

4. బోధకులందరు వెళ్ళలేరు

a) ఫిలిప్పీ 1:15

b) వారు క్రీస్తును బోధించారు గాని వారి హృదయాలోచన వేరుగా యున్నది.

5. బాధ్యత వంగీకరించని సంఘపెద్దలు వెళ్ళలేరు అపొ.కా. 20:23-31

6. నరకయాతనలో కొంతమంది సంఘ సభ్యులుందురు :

a) హెబ్రీ 10:24-29

b) 2పేతురు 2:20-22

c) ప్రకటన 3:15,16

పరలోకానికి వెళ్ళేవారు :

1. సువార్తకు విధేయులైనవారు 2థెస్స 1:7-9

2. ప్రభువుకు విధేయుడయ్యాడో లేదో ఎట్లు తెలిసికొనగలము ?

a) ప్రభువు ఇచ్చిన ఖచ్చిత ఆజ్ఞలకు లోబడాలి.

ఆయన నేరుగా ఆజ్ఞాపించినప్పుడు దానికే లోబడాలి. చితి సారకపు మ్రానుతో ఓడను చేయవలెనని దేవుడు నోవహుకు ఆజ్ఞ యిచ్చెను. అతడా మ్రానుతోనే ఓడను చేయాలి. కుష్టురోగము పోవునట్లు నయమాను యోర్దానులో ఏడుసార్లు మునగవలెనని చెప్పబడెను. అతడు యోర్దానులోనే ఏడుసార్లు మునగాలి. ఆరాధనలో మనం పాటలు పాడాలని దేవుడాజ్ఞ యిచ్చాడు; మనం పాటలనే పాడాలి గాని వాయించరాదు (ఎఫెసీ 5:19).

సాధారణ ఆజ్ఞలకు లోబడాలి. అంటే ఆయన చిత్తాన్ని నెరవేర్చుటకు ఈ సాధారణ ఆజ్ఞలలో మన విచక్షణను వినియోగించవచ్చు. ఉదా : సర్వలోకమునకు వెళ్ళి సువార్తను ప్రకటించుడి అని ఆయన ఆజ్ఞ యిచ్చాడు (మార్కు 16:15). **ఈ వెళ్ళడం ఎలా వెళ్ళాలి ?** అనేది మనము నిర్ణయించుకోవచ్చు. కాలినడకనా ? సైకిలుమీదా ? బస్సులోనా ? రైలులోనా ? ఇంకా ఎలాగైనా సరే వెళ్ళాలి. అట్లే ప్రకటించుట కూడా. సువార్త కూటములద్వారా ? ఇంటింటా ? రేడియో ద్వారా? యెలాగైనా సరే బోధించాలి. బోధించాల్సింది సువార్తనే గాని ఇంకేమైనను కాదు. ప్రభువు యిచ్చిన ఆజ్ఞలకు లోబడుచునే జీవించాలి. మరణ పర్యంతము నమ్మకముగా యున్నవారే జీవకిరీటం పొందుతారు (ప్రకటన 2:10).

**ముగింపు :**

1. దేవుని చిత్తాన్ని జరిగించువారే పరలోకం వెళ్ళుదురు (మత్తయి 7:21).
2. ఆయనకు విధేయులైన వారికే యేసుక్రీస్తు రక్షకుడుగాని ఆయనకు విధేయులు కానివారికి కాదు (హెబ్రీ 5:8,9).
3. నీవు పరలోకానికి వెళ్ళాలని కాంక్షించుచున్నావా ?

న్యూలామ్‌కాలో యున్న క్రీస్తు సంఘము ఆత్మీయముగను, సంఖ్యలోను దినదినము అభివృద్ధి చెందుచున్నది. చుర్‌చంద్రపూర్‌కు 40 కిలోమీటర్లలో బర్మా దేశపు సరిహద్దు కలదు.

అక్టోబర్ మొదటితేదీ శుక్రవారం సాగాంగ్ పట్టణములో జరిగిన సువార్త కూటములో మరి రెండు మారులు జాషువా గారు వాక్య పరిచర్య చేసిరి. పలువురు మతశాఖలవారు, హిందువులు కూడ ఆ కూటములకు హాజరై తమకున్న అనేక సందేహములకు దేవుని వాక్యపు వెలుగులో జవాబును కొనుగొనిరి. సాగాంగ్‌లో సోదరులు ఖులైన్ గారు వాక్య పరిచర్య గావించుచున్నారు.

అక్టోబరు 2,3 తేదీలలో రోజుకు మూడు కూటములు చొప్పున ఇంఫాల్ పట్టణములో లాంఫెల్ సంఘము ఏర్పాటు చేసిన కూటములలో సోదరులు జాషువా గారు వాక్యపరిచర్య చేసిరి. 3వ తేదీ సాయంత్రం జరిగిన ఆఖరి కూటములో సామ్యేల్ రోనీ గూట గారు ఇంగ్లీషులో వాక్యపరిచర్య చేయుగా వినిన వారందరు ముగ్ధులైరి, దేవుని స్తుతించిరి. ఈ కూటములన్నిటికీ సోదరులు శ్యామ్‌సలామ్ గారు స్థానిక సహోదరులతో కలిసి సారథ్యము వహించి, గొప్పగా నిర్వహించిరి. కూటములకు ఒక బస్సును కూడా అద్దెకు తీసికొని సోదర సోదరీల రాకపోకలకు తగిన రవాణా సౌకర్యమును స్థానిక సంఘములు ఏర్పాటు చేసిరి. మణిపూర్‌లో యున్న క్రీస్తు సంఘములన్నియును ఇంచుమించు స్వయం పోషక సంఘములే. అమెరికా సోదరుల ప్రమేయం అక్కడ శూన్యము గనుక స్వయం పోషక సంఘాలు నెలకొల్పబడుటకు అవకాశము కలిగెను. ఈ మధ్య కొందరు అమెరికా సోదరులు పరోక్షముగా అక్కడ ప్రవేశింప జూచుచున్నారు.

అక్టోబరు 4 సోమవారం నాడు జాషువా గారి బృందము బయలుదేరి ఇంఫాల్ నుండి కలకత్తా, కలకత్తా నుండి కాకినాడకు 5వ తేదీ సాయంత్రమునకు చేరుకొనిరి. అక్టోబరు 6వ తేదీనుండి 10వ తేదీ వరకు సోదరులు రోయస్ ఫ్రెడరిక్ గారితో కలిసి డెల్టా ప్రాంతములలో యున్న సంఘములను వారు దర్శింతురు.

సెప్టెంబరు 26 నుండి అక్టోబరు 15 వరకు కాకినాడ స్కూల్ ఆఫ్ ప్రీచింగ్ మొదటి సెమిస్టర్ అనంతర సెలవులకు మూయబడినది. అక్టోబరు 16న మరల బడి తెరువబడును. ప్రార్థించమనవి.

**ఉచితం!** **ఉచితం!** **ఉచితం!**

మీ ఇంటనే ఉండి బైబిలును
చదవండి. యేసుక్రీస్తును ఆయన
బోధనలను తెలుసుకోండి.
మేమిచ్చు ఉచిత బేసిక్ బైబిలు
కోర్సులో చేరండి. పోస్టుద్వారా ఆ
పాఠములను పూర్తిచేసి ఒక
బైబిలును ఉచితముగా పొందండి.
ఈరోజే మాకు వ్రాయండి.

**SATYA VANI**
P.O. Box. 80
KAKINADA - 533 001. A.P.

RNI Regd. No. 69973/98

PRINTED BOOK - BOOK POST

From :

To

**SATYA VAKKU**
P.O. BOX 80,
KAKINADA - 533 001

Edited & Published and Owned by Joshua Gootam & Published at Satya Vani-Church of Christ & Printed by him at Satya Vani Publications, Sambhamurthy St., Kakinada - 533 004.
Editor : Joshua Gootam